క్లుప్తంగా

ఐఓసీ ఆల్ ఇండియా లక్కీ డ్రా



లక్కీ డ్రాలో విజేతకు బహుమతి అందచేస్తున్న ఐఓసీ సేల్స్ మేనేజర్

ఒంగోలు అర్బన్: ఐఓసీ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) లిమిటెడ్ కంపోసిట్ సిలిండర్ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా లక్కీ డ్రాలో ఒంగోలు చెందిన వినియోగదారుడు ఎం రమేష్‌బాబు విజేతగా నిలిచి బహుమతి అందుకున్నాడు. సంతపేట బాలాజీ ఇండియన్ గ్యాస్ ప్రొప్రైటర్ రాధిక రాణి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఐఓసీ సేల్స్ మేనేజర్ దుగ్గినేని భాస్కర లింగారావు విజేతకు బహుమతి అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ఏజెన్సీ మేనేజర్ శివరామకృష్ణ, ఇతర సిబ్బంది మురళీమోహన్‌రావు, భాను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు బాగుండాలి



తిమ్మసముద్రంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రతి ఓటరు ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌లలో అవసరమైన వసతుల కల్పనకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని మట్టిగుంట, తిమ్మసముద్రం గ్రామాల్లో మంగళవారం పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆయన అక్కడి బీఎల్‌వోలతో మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తప్పకుండా కరెంట్, ఫ్యాన్లు, ఉండేలా చూడాలన్నారు. పరిశీలనలో ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

కనులపండువగా కల్యాణం



కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసియున్న ప్రసన్న చెన్నకేశవ స్వామి మాస కళ్యాణం బుధవారం చిత్త నక్షత్రం సందర్భంగా కనులపండువగా నిర్వహించారు. బుధవారం రాత్రి 7 గంటలకు స్వామి కల్యాణాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

మంచి చేసిన నాయకుడికి అండగా నిలుద్దాం

- కార్యకర్తల పరిచయ వేదికలో మంత్రి మేరుగు నాగార్జున



తక్కెళ్ళపాడులో మాట్లాడుతున్న మంత్రి మేరుగు

నాగులుప్పలపాడు: మాట ఇస్తే తప్పకుండా అన్నీ నెరవేర్చిన జగనన్నకు మనందరం అండగా ఉందామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. తక్కెళ్ళపాడు, నిడమానూరు గ్రామాల్లో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యకర్తల పరిచయ వేదికలో మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఏదైతే చెప్పాడో ఆ చెప్పిన మాటను నెరవేర్చి అట్టడుగు వర్గాలకు కూడా సంక్షేమ ఫలాలు అందించి అందరికీ మంచి చేసిన నాయకుడి పాలనను తిరిగి ఆశీర్వదించాలని కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ జెండా మళ్లీ



నాగార్జునకు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

ఎగిరి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ని చూడాలని ప్రతి కార్యకర్త కోరుకుంటున్నారని, దీనికి అనుగుణంగానే అందరం సమష్టి కృషితో పనిచేయాలన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు అండదండగా ఉండటానికి జగనన్న పంపించారని, ఆయన బాటలోనే నడిచే తాను ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. పరిచయ కార్యక్రమానికి వచ్చిన మేరుగు నాగార్జునకు తక్కెళ్లపాడు, నిడమానూరు గ్రామాల్లో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిడమానూరు గ్రామంలో మంత్రి మేరుగు నాగార్జున నాయకులతో కలిసి డా.బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లిఖార్జునరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఢాకా కృష్ణారెడ్డి, పులిచర్ల పరంధామిరెడ్డి, సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మల్లెల జాన్సన్, ఎంపీటీసీ యరజర్ల సుభాషిణి, యరజర్ల యోహను, వెంకటేష్, కొలకలూరి విజయ్ కుమార్, హరిబాబు, గంద్ర రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

కన్నుల పండుగలా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- స్వామి వారిని దర్శించుకున్న మంత్రి మేరుగు, స్థానిక ప్రజలు

చీమకుర్తి: శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం సంతనూతలపాడులో కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో టీటీడీ అర్చకులు ఎస్ జగదీశ్వరాచార్యుల పర్యవేక్షణలో విశేష పూజలతో ప్రతిష్ఠా వేడుకలు జరిగాయి. విగ్రహాలతో పాటు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డితో పాటు సంతనూతలపాడు మండలంలోని వేలాది మంది భక్తులు స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి శ్రీనివాస కల్యాణోత్సవం జరిగింది.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

30న ప్రభుత్వ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఒంగోలు టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 30న వైద్య విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాలలో బుధవారం క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్స్ సంయుక్తంగా నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ చదివే పోస్టుగాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. గత 10 ఏళ్ల వరల్డ్ డే అంశాలు, సంబంధిత అంశాలపై పర్చువల్ ఆన్‌లైన్ పద్ధతిలో ప్రిలిమినరీ రౌండ్ జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 7వ తేదిన ఫైనల్ రౌండ్ జరుగుతుందన్నారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన



క్విజ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు

విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.9 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలను ఐపీహెచ్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అప్పలనాయుడు, జెఏపీఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యప్రభ చేతుల మీదుగా అందజేస్తామన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి క్విజ్‌లలో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ క్విజ్ పోటీలను ఒంగోలు కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీదేవి, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ రాధిక, డాక్టర్ దివ్య, డాక్టర్ స్పందన, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ జునెట్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు.

ఫ్యాన్ గుర్తుకే మా ఓటు



50వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి

- అందరి నోటా ఒకటే మాట..
- నగరంలోని 45, 50 డివిజన్లలో బాలినేని శచీదేవి, శ్రీకావ్య ప్రచారం

ఒంగోలు: 'ఫ్యాన్ గుర్తుకే మా ఓటు..అందరి నోటా ఒకటే మాట..' నగరంలోని 50వ డివిజన్‌లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, 45వ డివిజన్‌లో వారి కోడలు బాలినేని శ్రీకావ్యలు 'మహిళలతో మమేకం-స్త్రీ శక్తితో శచీదేవి' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలు అందుకున్నారా...పథకాలు మీకు ఎలా ఉపయోగపడ్డాయంటూ వారితో మాటామాటా కలిపారు. గతంలో ఎన్నిసార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. కానీ నేడు ఇంటి వద్దే దరఖాస్తు ఫారాన్ని పూరించి రిజిస్ట్రేషన్ చేసి పట్టా చేతికి ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ ఇళ్ల పట్టాల కోసం ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల తర్వాత రిజిస్ట్రేషన్ చేసి పట్టా మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.230 కోట్లు తెప్పించి ఇప్పించిన ఘనత మీ వాసన్నదన్నారు. ఒంగోలు ఇంకా అభివృద్ధి చెందాలన్నా, అధిక మొత్తంలో నిధులు తేవాలన్నా వాసన్నతో మాత్రమే సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వపాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తయారయ్యాయన్నారు. మీ ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలన్నింటినీ అందిస్తున్న వలంటీర్లను టీడీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధకరమన్నారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, వెన్నపూస శోభారాణి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, గృహలక్ష్మి, జల్లిపల్లి సుబ్బులు, మల్లీశ్వరి, మరియమ్మ, కోటేశ్వరి, రవణమ్మ, 45వ డివిజన్‌లో కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, నితిన్‌రెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, పిల్లి శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, రంగిరెడ్డి రామిరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, కండే రాములు తదితరులు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో అవ్వతో మాట్లాడుతున్న బాలినేని శ్రీకావ్య

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: ఒంగోలు అమలనాథుని వారి వీధిలో కొలువైయున్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థాన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ తది ఆరాధన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులను దర్శనమిచ్చారు. సాయంత్రం వాసవీ కోలాట భజన బృందం కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కోలాటంలో మహిళలు

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



పరీక్షలు ముగిసిన తర్వాత బయటకు వస్తున్న విద్యార్థులు



మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ముగించుకుని ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు

ఒంగోలు రూరల్: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కరవది జెడ్పీ హైస్కూల్‌లో 110 మంది, త్రోవగుంట పరీక్ష కేంద్రంలో 190 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, తెల్లబాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని మూడు సెంటర్‌లలో 542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 523 మంది పరీక్షలు రాశారని ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని సహకరించిన చీఫ్‌లకు, డీఓలకు, ఉపాధ్యాయులకు పోలీసు శాఖకు, మెడికల్ డిపార్ట్‌మెంట్ వారికి ఆయన అభినందనలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు నాటకం ప్రాముఖ్యపై అవగాహన కల్పించడం, నాటక సంస్థలను ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ నాటకాలతో మానసిక ఉల్లాసం నెలకొంటుందన్నారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ నాటకరంగ సంస్థలు, కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా సంస్థ అధ్యక్షులు మిడసల మల్లిఖార్జున రావు, కళామిత్ర మండలి జాతీయ.అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సంస్థ కార్యదర్శి కనమాల రాఘవులు, డాక్టర్ కె. సీతారామయ్య, ఆర్ సదానందరావు, జి.మస్తానయ్య, కుర్రా ప్రసాద్బాబు, తంగెళ్ల నాగభూషణం, పి.వెంకటేశ్వర్లు, రాయపాటి ఆశీర్వాదం మాట్లాడారు. తొలుత చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళా పోషకులు, యువ పారిశ్రామికవేత్త కుందురు పుల్లారెడ్డిని సత్కరించారు.

డివైడర్ నిర్మాణానికి రోడ్డు పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు

కొత్తపట్నం: కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో రూ.2.75 కోట్లతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనావెంకట్రావు బుధవారం పరిశీలించారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ సాధారణ నిధులు రూ.47 లక్షలు ఆమె మంజూరు చేయించారు. ఈ నెల 14న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శింగరాజు మీనా వెంకట్రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. డివైడర్ నిర్మాణానికి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులతో మాట్లాడుతూ రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో రెండు రోజుల తరువాత డివైడర్ పనులు ప్రారంభిస్తామన్నారు. బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు డివైడర్ వస్తుందన్నారు. సాధ్యమైన త్వరగా డివైడర్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డివైడర్ పనులు పూర్తయితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వాహనాలు వెళతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, తంబి కాంతారావు, తంబి సురేష్, గౌరవరపు శివాజీ, మోటుపల్లి బాబు, తంబి వెంకటేశ్వర్లు, మరపాల సుధాకర్‌రెడ్డి, పిన్ని వరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

78 మద్యం బాటిళ్ల పట్టివేత



మద్యం సీసాలను పట్టుకున్న సెబ్ పోలీసులు

ఒంగోలు టౌన్: మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని ఒంగోలు సెబ్ సిబ్బంది పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని కర్నూలు రోడ్డులో విద్యుత్ కార్యాలయం వద్ద సెబ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా సత్తల అజయ్ కుమార్, మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేసే గంట శేఖర్‌బాబును పట్టుపడ్డారు. వారిని తనిఖీ చేయగా 78 మద్యం సీసాలు లభించాయి. అనధికారంగా మద్యం విక్రయిస్తున్నట్లు నిర్ధారించిన పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా సెబ్ సీఐ జి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో మద్యం దుకాణాలలో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. దాడుల్లో సెబ్ ఎస్సై సీహెచ్ గీత, జేడీ టీం కానిస్టేబుల్ కె. ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.